సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 3 । ఆగస్టు । 2024



కీచక కరస్పాండెంట్

అనంతపురంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ 73 ఏళ్ల ఆంజనేయులు గౌడ్ నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. -8లో



ఆటో-లారీ ఢీ..ఇద్దరు కూలీల మృతి

వారంతా కూలీలు..జానెడు పొట్ట నింపుకోవడం కోసం ఆటోలో కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. -8లో

గరిష్టం/కనిష్టం
35.0/27.6

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.6 – 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం తెల్లవారు జామున వర్షం కురిసింది. సిద్దవటంలో 6.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.బి.కోడూరులో 1.8, బద్వేల్‌లో 1.2, ప్రొద్దుటూరులో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

దేవదాయశాఖ కార్యాలయం మార్పు

కడప కల్చరల్: జిల్లా దేవదాయశాఖ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మార్చారు. ఇంతవరకు ఆ కార్యాలయం కడప కో ఆపరేటివ్ కాలనీలోని నెహ్రూ పార్కువద్దగల భవనంలో ఉండేది. ప్రస్తుతం దానిని రాజంపేట బైపాస్ రోడ్డు సర్కిల్ పద్మావతి నగర్‌లోని 3/2 వార్డు సచివాలయం వద్ద కొత్తగా నిర్మించిన భవనంలోకి తరలించినట్లు ఆ శాఖ ఏసీ శంకర్ బాలాజీ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపలోని శిశుగృహలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు పొందేందుకు కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాలను జతపరిచి ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కార్యాలయ పనివేళల్లో శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వైవీయూలో నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డ్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలను ప్రారంభించనున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి. లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ప్రవేశాలు ఈనెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు యోగివేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకుల కార్యాలయం (డీఓఏ)లో జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదేళ్లు నిండిన ఎవరైనా ఈ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9032595101 నంబర్‌లో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాలకు www.yvu.edu.in వెబ్‌సైట్ చూడాలని చెప్పారు.

వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా జయరామిరెడ్డి



ఆచార్య బి. జయరామిరెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: ప్రొద్దుటూరు పట్టణంలోని డాక్టర్ వైయస్సార్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ వైవీయూ ప్రిన్సిపాల్‌గా ఆచార్య బి. జయరామిరెడ్డిని నియమించారు. విశ్వవిద్యాలయంలో వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి నియామకపు పత్రాన్ని రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తో కలిసి ఆచార్య జయరామిరెడ్డికి అందజేశారు. ఇదివరకు ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య నాగరాజు పదవీకాలం పూర్తి కావడంతో ఈ నూతన నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు డా. నాగరాజు, డీన్ ప్రొఫెసర్ రమణయ్య, ఆచార్య జయచంద్ర రెడ్డి, డా. నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

జమ్మలమడుగు: జూనియర్, సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు ఈనెల 4వతేదీన వైఎస్సార్‌జిల్లా దువ్వూరు మండలంలో జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు వై.క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంకట రమణ పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో పాల్గొనే వారు 2005 జనవరిలో, సబ్ జూనియర్ విభాగానికి సంబంధించి 2009 జనవరిలో జన్మించిన వారై ఉండాలన్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపిక పోటీలను రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకరులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రము, ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్లు , డ్రస్ కోడ్, షూ వేసుకుని రావాలన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన సబ్ జూనియర్ జట్టు సభ్యులు సెప్టెంబర్ 13,14,15 తేదిల్లో తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9490181104 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

ఇదేమి రాజ్యం!

చెరువులు, గుట్టలు, వాగులు, వంకలు అక్రమార్జనకు కాదేదీ అనర్హం అన్నట్లు తెలుగుతమ్ముళ్లు వ్యవహరిస్తున్నారు. అధికారమే ఏకైక పెట్టుబడిగా యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. మరోవైపు రాజకీయ ప్రత్యర్థుల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టడం, ఇంకోవైపు ఆర్థిక పరిపుష్టి పెంచుకునేందుకు అడ్డదారులు ఎంచుకున్నారు. ఈ క్రమంలో మైదుకూరు మండలంలోనే వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అదే దినచర్యగా పెట్టుకుని సుప్రీంకోర్టు ఉత్తర్వులు సైతం పెడచెవిన పెడుతూ చెరువులను చెరబట్టారు.

- పుట్టా ఇలాఖా అక్రమాలకు అడ్డా
- తిప్పిరెడ్డిపల్లె చెరువును చెరబట్టిన తెలుగుతమ్ముళ్లు
- యథేచ్ఛగా గ్రావెల్ దోపిడీ
- నాడు రాయల్టీ చెల్లించకుండా గ్రావెల్ దోపిడీగా వర్ణించిన ఎమ్మెల్యే పుట్టా
- చెరువులు, గుట్టలు కొల్లగొడుతున్నా ప్రేక్షకపాత్ర



తిప్పిరెడ్డిపల్లె చెరువు నుంచి మిషన్ల ద్వారా లోడింగ్ చేస్తూ గ్రావెల్ లూటీ చేస్తున్న దృశ్యం



ఎమ్మెల్యే పుట్టా స్టిక్కరున్న వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

సాక్షి ప్రతినిధి, కడప: మైదుకూరు నియోజకవర్గంలో తెలుగుతమ్ముళ్లు అక్రమార్కుల అవతారమెత్తారు. చెరువులు, వాగులు, పోరంబోకు భూములను చెరబట్టారు. ఎమ్మెల్యే పేరు చెబుతూ అక్రమంగా స్వాధీనం చేసుకుంటున్నారు. మొన్న నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 859లో 16 ఎకరాలు, సర్వేనంబర్ 840లో 70 ఎకరాలు భూమికి ఏకంగా కంచె వేసిన వైనం వెలుగులోకి వచ్చిన విషయం విధితమే. తాజాగా తిప్పిరెడ్డిపల్లె పరిధిలోని గోడేరు చెరువులో 50ఎకరాలు అన్యాక్రాంతమైంది. వల్లూరమ్మ చెరువు పేరుకు మాత్రమే ఉండిపోయింది. 30 ఎకరాల్లో ఉన్న చెరువు 2 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. సర్వే నంబర్ 77లో 4ఎకరాలు కొండ పొరంబోకును చదును చేశారు. 138/సీలో కుంట పోరంబోకు 12 ఎకరాలు సబ్‌డివిజన్ చేయించుకొని పాసుబుక్‌లు కూడా తెచ్చుకున్నారు. సర్వే నంబర్ 742, 743లో గయ్యాళి భూమిలో జేసీబీలు పెట్టి తయారు చేస్తున్నారు. పట్టపగలు వీటిని యథేచ్ఛగా తెలుగుతమ్ముళ్లు చెరబడుతున్నా రెవెన్యూ యంత్రాంగం అధికార మత్తులో ఉందని ప్రజాస్వామ్యవాదులు ఆరోపిస్తున్నారు.

నాడు రాయల్టీ చెల్లించలేదన్న పుట్టా....

మైదుకూరు నియోజకవర్గంలో అల్లాడుపల్లె నుంచి వనిపెంట వరకు 25 కిలోమీటర్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగనున్నాయి. ఈపనులను మెఘా ఇంజనీరింగ్ సంస్థ చేపట్టింది. శరవేగంగా కొనసాగుతున్న ఆ పనులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బ్రేకులేశారు. ఈ విషయాన్ని గత నెల 5న సాక్షి వెలుగులోకి తీసుకవచ్చింది. స్పందించిన ఎమ్మెల్యే పుట్టా రాయల్టీ చెల్లించకుండా కొండలు, గుట్టలు నుంచి గ్రావెల్ దోపిడీ చేశారని, రాయల్టీ వస్తే స్థానికంగా అభివృద్ధి పనులకు ఆస్కారం ఉంటుందనే ఉద్దేశాన్ని వెల్లడించారు. వాస్తవంగా అవే పనులకు ఎమ్మెల్యే పుట్టా అనుచరులు తిప్పరెడ్డిపల్లె చెరువు, గుట్టల నుంచి నిత్యం రెండు మిషన్లతో లోడింగ్ చేస్తూ లారీల ద్వారా కోట్లాది విలువ చేసే గ్రావెల్ తరలిస్తున్నారు. మట్టి పార్మెషన్ సబ్‌లీజు తీసుకొని తిప్పిరెడ్డిపల్లె చెరువు నుంచి యథేచ్ఛగా ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా తరలిస్తున్నారు. అడ్డగించిన ఇరిగేషన్ అధికారులకు చీవాట్లు తప్పడం లేదు. తాత్కాలికంగా ఒక్క రోజు మాత్రమే గ్రావెల్ తరలింపునకు విరామమిచ్చి తర్వాత క్రమం తప్పకుండా తిప్పిరెడ్డిపల్లె చెరువు, సమీపంలో ఉన్న గుట్టను లూటీ చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నాడు రాయల్టీ చెల్లించలేదన్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నేడు ఆయన సొంత కంపెనీకి చెందిన సొంత వాహనాలల్లో అక్రమంగా మట్టి తరలించడం విశేషం. ప్రకృతి సంపదను కాపాడాల్సిన బాధ్యత అటు ప్రజాప్రతినిధులు, ఇటు జిల్లా యంత్రాంగంపై ఉంది. కలెక్టర్ లోతేటి శివశంకర్ ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.!

సమరయోధులకు కేటాయించిన భూమికి తిప్పలే..

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు కేటాయించిన భూమికి కూడా తిప్పలు తప్పడం లేదు. తిప్పిరెడ్డిపల్లె పొలం సర్వే నంబర్ 231లో కేటాయించారు. చదును చేసుకునేందుకు ఖర్చులకు భయపడ్డ ఆయా కుటుంబసభ్యులు ఆ భూములు ఖాళీగా ఉంచితే తాజాగా తెలుగుతమ్ముళ్లు జేసీబీలతో చదును చేస్తున్నారు. స్థానికంగా వీఆర్వో అభ్యంతరం పెడితే బూతులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం చెరువులు, వాగులు స్వాహా చేయడం తీవ్రమైన నేరం. అలాంటిది 120 ఎకరాలున్న గోడేరు చెరువులో 50 ఎకరాలు కబ్జాకు గురైంది. వల్లూరమ్మ చెరువు 28ఎకరాలు స్వాహా చేశారు. స్వాహా విషయం వాస్తవమేనని ధృవీకరిస్తూ ఇరిగేషన్ అధికారులు సైతం అంగీకరించి, తహసీల్దార్‌కు వివరిస్తూ చర్యలు చేపట్టాలని గడిచిన సోమవారం సిఫార్సు లేఖ కూడా రాశారు. అయినప్పటికీ ఇవేవి పట్టించుకునే స్థితిలో రెవెన్యూ యంత్రాంగం లేదనే చెప్పాలి.



గ్రావెల్ నింపుకొని తరలివెళ్తున్న భారీ వాహనాలు

వైవీయూతో నీటిపారుదల శాఖ ఎంఓయూ



పత్రాలు చూపుతున్న వైవీయూ, నీటిపారుదలశాఖ అధికారులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం ఎర్త్ సైన్స్ విభాగం, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం.. ప్రభుత్వ నీటిపారుదల శాఖ కడప మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. శుక్రవారం సాయంత్రం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, కడప నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) ఎస్. మల్లికార్జునరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి వాటిని పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆధునిక జియో స్పేషియల్ సాంకేతిక వనరులు, అలానే మానవ వనరుల పరస్పర వినియోగం చేసుకోవడానికి పరస్పరం అంగీకరించారు. నీటిపారుదల శాఖ కడప వారికి కావాల్సిన జియో స్పేషియల్ మోడలింగ్, డ్యాములు, కాలువల అలైన్మెంట్ నిర్ధారణకు కావాల్సిన విధానం మీద అవగాహన, సాంకేతిక శిక్షణల ద్వారా సేవలను, ఆధునిక సాంకేతికతను వినియోగించడంలో వైవీయూ ఎర్త్ సైన్స్‌శాఖ సహకరిస్తుంది. విశ్వవిద్యాలయ విద్యార్థులకు నీటిపారుదల శాఖ లైవ్ ప్రాజెక్టుల్లో ఆ శాఖ ఇంజనీర్ల ద్వారా ఎక్స్ పోజర్ లభిస్తుంది. నీటిపారుదల శాఖకు అవసరమైన సాంకేతిక పరీక్షలు ప్రొద్దుటూరు ఇంజనీరింగ్ కాలేజి సివిల్ ఇంజనీరింగ్ విభాగము నిర్వహించి సహకరిస్తుందని ఎర్త్ సైన్స్ ఆచార్యులు తుమ్మలకుంట శివప్రతాప్ తెలిపారు. రాయలసీమలో నీటిపారుదల శాఖ విశ్వవిద్యాలయంతో చేసుకున్న తొలి ఒప్పందమని ఆ శాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఎస్ఈ శారద, డి.వెంకట్రామయ్య, ఈఈ రమేష్, డీఈ.ఈ హబీబుల్లా, వైవీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య జయరామిరెడ్డి పాల్గొన్నారు.

మంచం మీదున్నా రావాల్సిందే

- పింఛన్ కోసం వృద్ధుడి పడరానిపాట్లు
- వలంటీర్లు ఉంటే అగచాట్లు ఉండేవి కావంటున్న కుటుంబసభ్యులు





రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వెంకటరమణ, అధికారి ఇంటి వద్ద ఆటోలో ఉన్న రమణకు పింఛన్ ఇస్తున్న దృశ్యం

ఖాజీపేట: ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం చెబుతోంది.. అయితే ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఆసుపత్రిలో ఉన్న వారి పరిస్థితి గురించి ప్రభుత్వం ఆలోచించలేదు.. ఎందుకంటే పింఛన్ పంపిణీ మా బాధ్యత కాదు ఆసుపత్రికి వెళ్లి ఇవ్వాల్సిన అవసరం మాకులేదని అంటున్నారు. దీంతో విధిలేని పరిస్థితిలో ఆసుపత్రిలో బెడ్ పై ఉన్న పేషెంట్ అధికారి ఇంటికి వచ్చి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన వైఎస్సార్ జిల్లా ఖాజీపేటలో చోటు చేసుకుంది. వివరాలు.. ఖాజీపేట టౌన్ అగ్రహారంలో ఉండే మారుబోయిన వెంకట రమణ (65) వృద్ధాప్య పెన్షన్ తీసుకుంటున్నాడు. ఏడాదిగా మంచంలోనే ఉన్నాడు.ఆరు రోజుల కిందట ఉబ్బసం రావడంతో అపస్మారక స్థితిలో కడప రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌లో 5 రోజులుగా చికిత్స చేయించుకుంటున్నాడు. ఒకటో తేదీ రావడంతో అతని కుమారుడు మారుబోయిన వాసు పింఛన్ పంపిణీ చేసే అధికారి లీలావతి వద్దకు వెళ్లి తన తండ్రి పరిస్థితి గురించి వివరించాడు.. అయితే ఆమె నేను ఆసుపత్రికి వచ్చి ఇవ్వలేనని చెప్పారు.. దీంతో పంచాయతీలోని అధికారులందరినీ అడిగినా ఎవ్వరూ స్పందించలేదు. దీంతో ఆటో తీసుకొస్తాం.. అందులో కడపకు వెళ్లి పింఛన్ మా తండ్రికి ఇవ్వాలని అధికారి లీలావతికి విన్నవించుకున్నాడు. మా దగ్గరికి వస్తే ఇస్తాను.. లేక పోతే ఇవ్వలేను.. మాకు ఆసుపత్రికి వెళ్లి ఇవ్వాలని రూల్ లేదని చెప్పారు. దీంతో 2వ తేదీ ముగిస్తే పింఛన్ పోతుందని భావించి కష్టమైనా వైద్యులతో మాట్లాడి కడపలో ఆటో తీసుకుని రిమ్స్ నుంచి బెడ్ పై ఉన్న వెంకటరమణను తీసుకుని అధికారి ఇంటికి వెళ్లారు. ఆమె ఆటోలో ఉన్న వ్యక్తి వేలి ముద్రలు తీసుకుని పింఛన్ అందించారు. అదే ఆటోలో తిరిగి కడపకు వెళ్లారు. ఆసుపత్రిలో మంచాన ఉన్న రోగికి పింఛన్ ఇచ్చేందుకు అధికారులకు మానవత్వం ఉండదా అంటూ కుటుంబసభ్యులు వాపోతున్నారు. అదే వలంటీర్లు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని అంటున్నారు. అధికారులు ఇలాంటి వారి పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరి కాదని అంటున్నారు. మానవత్వంతో ఆలోచించి పనిచేయాలని అంటున్నారు.

చేనేతలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం

కలెక్టర్ శివశంకర్



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఉత్పత్తయ్యే చేనేతలకు ప్రపంచ స్థాయి గుర్తింపును తీసుకువచ్చేందుకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా చేనేత, జౌళి సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజారావు అధ్యక్షతన మైలవరం మండలంలో టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి పనుల పురోగతిపై చేనేత కార్మిక సంఘాల కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేనేతలకు పూర్వవైభవం తీసుకురావడంతోపాటు ప్రపంచ మార్కెట్‌లో మన చేనేత ఉత్పత్తులకు గుర్తింపును తెచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. మగ్గాలనే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న జిల్లా చేనేత వృత్తిదారులను ఆదుకునేందుకు, చేనేత వృత్తిని ప్రోత్సహించడానికి దాదాపు 3000 మందికి ఉపాధి అవకాశాలు అందేలా ప్రభుత్వం జిల్లాలోని మైలవరం మండల పరిధిలో టెక్స్ టైల్ పార్కును ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు ఉత్పత్తి చేసిన పలు రకాల వస్త్రాలను జిల్లా కలెక్టర్‌కు చూపించి వాటి ప్రాశస్త్యాన్ని వివరించారు. జిల్లాలో ఉత్పత్తవుతున్న చేనేత వస్త్రాలను చూసిన జిల్లా కలెక్టర్ మంత్రముగ్ధులై ఇంతటి కళను జిల్లాకే పరిమితం చేయడం కాదని, ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, ఏపీ ఐఐసీ డిప్యూటీ జెడ్‌ఎం కమలాకర్, యూనియన్ బ్యాంకు ఆర్‌ఎం లక్ష్మి తులసి పాల్గొన్నారు.

- జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో చేపడుతున్న భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాల క్లియరెన్స్ ప్రక్రియలను పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలపై శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్.. ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ శివశంకర్‌తోపాటు.. జేసీ అదితి సింగ్, డిఎఫ్ఓ సందీప్‌రెడ్డిలు హాజరయ్యారు.

కలకు పదును పెట్టి.. కొలువు చేపట్టి

కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి.. అంటూ భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం యువతకు ఇచ్చిన స్ఫూర్తిదాయక సందేశాన్ని ఆయన అందిపుచ్చుకున్నారు. పట్టుదలతో చదివారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఐఏఎస్‌గా ఎంపికై ప్రజాసేవే నా అభిమతం అంటున్నారు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్.

- మొదట ఐపీఎస్, రెండో ప్రయత్నంలో ఐఏఎస్
- ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం
- విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనపైనే దృష్టి
- మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్



సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

మదనపల్లె : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్స్ సర్వీసెస్‌లో ఏదో ఒకటి సాధిస్తే చాలు...లైఫ్‌లో బిందాస్ లైఫ్ గడపవచ్చని అనుకుంటారు. కానీ మేఘ స్వరూప్ అలా కాదు...ఐపీఎస్...ఐఏఎస్ రెండింటినీ సాధించారు. మొదట మహారాష్ట్ర కేడర్‌లో ఐపీఎస్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ... ఆ తర్వాత రెండో ప్రయత్నంలో ఐఏఎస్ అయ్యారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పం బలంగా ఉండటంతో ఐఏఎస్ అవ్వాలని నిర్ణయించుకున్నానంటున్న మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విజయ ప్రస్థానంపై సాక్షి ప్రత్యేక కథనం...

కుటుంబ నేపథ్యం....

కర్నూలు జిల్లా బండి ఆత్మకూరు, నారాయణపూర్ స్వస్థలం. కర్నూలు కృష్ణానగర్‌లో స్థిర నివాసం. తండ్రి చంద్రశేఖర్‌రావు పంజాబ్ జలంధర్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌లో సీనియర్ జీఎంగా పనిచేస్తున్నారు. తల్లి వై.అరుణ గృహిణి. తమ్ముడు వై.సందీప్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేసి మణిపాల్ కస్తూర్బా మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్నారు. మేఘస్వరూప్‌ది ప్రేమ వివాహం. ముస్సోరి ఐఏఎస్ ట్రైనింగ్‌లో మణిపూర్‌కు చెందిన వైకుం నిధియా దేవిని ప్రేమించి, 2023 ఫిబ్రవరిలో తిరుమలలో పెళ్లి చేసుకున్నారు. ఆమె ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విద్యాభ్యాసం: మేఘ స్వరూప్ ప్రాథమిక విద్యాభ్యాసం కేంద్రీయ విద్యాలయం గుత్తిలో జరిగింది. వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీ ఐఐటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశారు. బెంగళూరులో ప్రైవేట్ సెక్టార్‌లో కొంతకాలం పాటు పనిచేశారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతో ఐఏఎస్‌కు సన్నద్ధమై 2019లో 98వ ర్యాంకు సాధించి, ఐపీఎస్ మహారాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. 2020లో రెండో ప్రయత్నంగా సివిల్స్ పరీక్ష రాసి 31వ ర్యాంకుతో ఏపీ క్యాడర్‌కు ఐఏఎస్‌గా ఎంపికయ్యారు. ముస్సోరిలోని లాల్‌బహదూర్‌శాస్త్రి అకాడమీలో రెండేళ్ల ట్రైనింగ్‌లో...ఏడాదిపాటు చిత్తూరు జిల్లాలో కలెక్టర్లు హరినారాయణ్, షన్మోహన్‌ల పరిధిలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా మొదటి పోస్టింగ్ పొందారు. సరిగ్గా ఆ సమయంలోనే సార్వత్రిక ఎన్నికలు జరుగుతుండటంతో జిల్లాలో దంపతులిద్దరూ ఐదు నియోజకవర్గాల బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారు.


క్షేత్రస్థాయి పర్యటనలతో మెరుగైన పాలన..

'రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కువగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకుని, నాణ్యమైన సేవలతో మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తాను. ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులపై అన్నిశాఖల సిబ్బంది సత్వరమే స్పందించి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను. ప్రజల కోసం సబ్ కలెక్టరేట్‌లో ప్రత్యేకమైన విభాగాన్ని ఏర్పాటు చేసి, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తాను'.. అని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ తెలిపారు.

మదనపల్లెలో ఛాలెంజింగ్ టాస్క్ ..

మదనపల్లెకు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాల్సిన రోజే ఛాలెంజింగ్ టాస్క్ ఎదుర్కోవడం జరిగింది. సబ్ కలెక్టరేట్‌లో జరిగిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కావడం, బాధ్యతలు తీసుకున్న రోజు నుంచి రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తో కలిసి రెవెన్యూ అంశాలపై అవగాహన పెంచుకున్నాను. కార్యాలయాన్ని తిరిగి మునుపటిలా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తున్నాను. అన్ని విభాగాలకు సంబంధించి సమీక్ష జరిపాను. కాలిపోయిన ఫైళ్లను సిబ్బంది సహాయంతో రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాను. ల్యాండ్ అక్విషన్, ఆర్ఓఆర్ ఫైల్స్ కార్యాలయ సొరుగుల్లో భద్రంగా ఉన్నాయి. పోలీసులు అనుమతించాక తీసి చెక్ చేస్తాం'. అని తొలిరోజే తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు.

ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

కడప అర్బన్: జిల్లాలోని ఏఆర్ సిబ్బంది సంక్షేమంపై జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్'పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఆర్ సిబ్బందికి దర్బార్ పరేడ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ, ఏఆర్ సిబ్బంది సంక్షేమానికి తక్షణమే పలు చర్యలు తీసుకోవాలనీ ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావును ఆదేశించారు. గార్డు రూముల్లో మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. ఏఆర్ సిబ్బంది పిల్లల భవిష్యత్తుకు దోహదపడేలా ఉన్నత విద్యావకాశాలపై విద్యారంగంలో నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించాలని అన్నారు. బయటి ప్రాంతాల్లో బందోబస్తు విధులకు వెళ్లే సిబ్బందికి భోజనం, వసతికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని చెప్పారు. సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలనీ, పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. సిబ్బంది విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకుని కుటుంబసభ్యులతో గడపాలని సూచించారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి రాష్ట్రంలో కడప జిల్లా ఏ.ఆర్.ను ప్రత్యేక స్థానంలో నిలపాలనీ జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.ఏఆర్. డీఎస్పీ మురళీధర్, ఏఓ జ్యోతి, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, వీరేష్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నార్కోటిక్స్ బృందాల తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి, స్పెషల్ పార్టీ పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గంజాయి విక్రయించే వారిపై నిఘా పెంచామని, ఎక్కడైనా విక్రయాలు జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

గంజాయి విక్రేత అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ పి.నరసింహారెడ్డి

కడప అర్బన్ : డిస్ట్రిక్ట్ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్ (డి.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో గంజాయి విక్రయాలపై దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ నరసింహారెడ్డి ఎస్‌ఐ రవికుమార్‌లు తనిఖీలు చేపట్టారు. పాత బైపాస్ సర్కిల్‌లో సారక నరసింహులును అరెస్ట్ చేసి అతని నుంచి రూ.20వేల విలువైన రెండు కిలోల గంజాయి, హోండా డియో కంపెనీకి చెందిన స్కూటీ, సెల్‌ఫోన్, రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

మూడు దుకాణాల్లో చోరీ

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనో విజన్ ఎదురుగా మూడు దుకాణాల పైకప్పులను తొలగించి గత రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సెలూన్ షాపు, చిల్లర అంగడి, సిమెంట్ అంగళ్లలో పైకప్పు తొలగించి దుండగులు చొరబడి మొత్తం రూ.25 వేల నుంచి రూ.30 వేలు అపహరించుకు వెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఎనిమిది మంది బైండోవర్

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్‌వీ.కొండారెడ్డి తెలిపారు. వీరభద్రాపురం సమీపంలోని సర్వే నెంబర్ 311-ఎలో బంజరు భూమి విషయంలో లక్ష్మీపేటకు చెందిన వరికూటి చంద్ర ఓబుళరెడ్డి, బద్వేల్ సురేంద్రనాథ్‌రెడ్డి కుటుంబీకుల నడుమ గత కొన్ని రోజులుగా వాగ్వాదం జరుగుతోంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు చెందిన ఎనిమిది మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

35 మంది సీఐల బదిలీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో 35 మంది సీఐలను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలో 14 మంది, అన్నమయ్య జిల్లాలో 21 మంది సీఐలను బదిలీ చేశారు. వీరంతా వెంటనే బదిలీ స్థానాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

కీచక కరస్పాండెంట్

- మనవరాలి వయసున్న బాలికపై అత్యాచారం
- కరస్పాండెంట్ చేష్టలను పిన్నికి ఫోన్‌లో తెలిపిన విద్యార్థిని
- అనంతపురం లిటిల్‌ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులుపై పోక్సో కేసు



లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌ను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

అనంతపురం : అనంతపురం నగరంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ నాల్గో తరగతి చదువుతున్న చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. సమాజంలో ఇన్నాళ్లూ పెద్ద మనిషిగా చలామణి అయిన 73 ఏళ్ల ఇతను మనవరాలి వయసు ఉన్న అభం శుభం తెలియని చిన్నారిని లోబరచుకుని అకృత్యానికి ఒడిగట్టాడు. అమానుష ఘటనకు సంబంధించి బాధితురాలి కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

బాధిత చిన్నారి తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన వారు. బతుకుదెరువు కోసం దుబాయిలో ఉంటున్నారు. దీంతో పిన్ని సంరక్షణలో చిన్నారి ఉంటోంది. రెండు నెలల క్రితం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో నాల్గో తరగతిలో చేర్పించారు. కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్ గత శని, ఆదివారం రెండు దఫాలు తనపై అత్యాచారానికి పాల్పడినట్లు చిన్నారి తన పిన్నికి ఫోన్‌లో తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫోన్ సంభాషణను పోలీసులకు అప్పగించారు. 'నగ్నంగా మీద పడుకోవాలని సార్ (ఆంజనేయులు గౌడ్) తరచూ అంటుంటాడు. క్లాస్‌కు వెళ్లాలి.. సార్ కొడతారని చెప్పినా వినకుండా నన్ను అలా చేశారు. ఒకసారి డబ్బులు కూడా ఇచ్చాడు. అవి పెట్టెలో పెట్టి తాళం వేయడం మరచిపోయాను. దీంతో డబ్బులు ఎవరో తీసుకున్నార'ని అమాయకంగా వివరించింది. ఈ మాటలు విన్న పిన్ని, బాబాయ్ బోరున విలపిస్తూ శుక్రవారం ఉదయమే పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడే ఉన్న కరస్పాండెంట్‌ను నిలదీశారు. ఇంతలోనే విద్యార్థి సంఘాల నాయకులకు విషయం తెలియడంతో వారు కూడా వచ్చి కరస్పాండెంట్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతన్ని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ నేతృత్వంలో విచారణ చేపట్టారు. ఆంజనేయులు గౌడ్ నుంచి కీలక విషయాలను రాబట్టారు. లైంగిక దాడి జరిగినట్లు స్పష్టమైందని, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసు అధికారులు తెలిపారు. చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో చిన్నారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

టీడీపీ నాయకుల అండ

కరస్పాండెంట్ ఆంజనేయులు గౌడ్‌కు మద్దతుగా టీడీపీకి చెందిన కొందరు నాయకులు సోషల్ మీడియాలో అనుకూల పోస్టింగ్‌లు పెట్టారు. అభం శుభం తెలియని విద్యార్థినిపై అఘాయిత్యం జరిగితే ఖండించాల్సింది పోయి.. కీచక కరస్పాండెంట్‌కు అనుకూలంగా పోస్టింగ్‌లు పెట్టడం గమనార్హం. వారి తీరును సామాన్య ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నిందితుణ్ని కఠినంగా శిక్షించాలి

చిన్నారి ఫోన్‌లో విషయం చెప్పడంతో పాఠశాల వద్దకు వచ్చాం. పాప ఏడుస్తూనే ఉంది. ఏమి జరిగింది చెప్పమ్మా అంటే.. జరిగినది మొత్తం వివరించింది. వెంటనే మా అన్న, మా చెల్లి వాళ్లకు ఫోన్ చేసి చెప్పాను. మా అన్నవాళ్లు అందరూ వచ్చారు. తెలుగు టీచర్ చెప్పింది అంట .. ఇక్కడ జరిగింది మీ వాళ్లకు చెబితే టీసీ ఇచ్చి పంపిస్తామని బెదిరించారట. జరిగిన దాని గురించి చెప్పొద్దు. డబ్బులు ఇస్తామని చెప్పారు. డబ్బులు కూడా పాపకు ఇచ్చారు. అఘాయిత్యానికి పాల్పడిన పాఠశాల కరస్పాండెంట్‌ను కఠినంగా శిక్షించాలి.

– చిన్నారి పిన్ని

9న క్విట్ కార్పొరేట్

– ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఈ నెల 9న క్విట్ కార్పొరేట్ దినంగా జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. అన్ని మండలాల రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొని నిరసనలు తెలియజేయాలని ఆయన కోరారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలలో ప్రధాని మోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఆత్మహత్యలు లేకుండా చేస్తామని, మద్దతు ధర కల్పిస్తామని చెప్పారన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చారన్నారు. రైతులు తమ భూములలోనే కంపెనీలకు కూలీలుగా మారిపోతారని గ్రహించి.. శాంతియుతంగా పోరాటాలతో చట్టాలు రద్దు చేయించుకున్నామన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడే విత్తన చట్టం లేదని, క్రిమిసంహారక మందుల విక్రయాలపై కంట్రోల్ తొలగించి ఎప్పటికప్పుడు ధర పెంచుకునే అవకాశం ఇచ్చారన్నారు. స్వామి నాథన్ కమిషన్ సూచన ప్రకారం మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం సాధించుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలను నిషేధించాలని క్విట్ ఇండియా పిలుపునిచ్చిన రోజైన ఆగస్టు 89న క్విట్ కార్పొరేట్ నినాదంతో అన్ని జిలా కేంద్రాలలో నిరసనలు తెలపాలన్నారు.

మహిళలపై దాడి చేసిన టీడీపీ నాయకులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న వారిపై టీడీపీ నాయకుడు రామచంద్రారెడ్డి, మరింతమంది దాడులు చేయడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు జి.శివకుమార్ వి.అన్వేష్ డిమాండ్ చేశారు. నగరంలోని వ్యకాస కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేల్ మండలం సి.కొత్తపల్లి పరిధిలోని ప్రభుత్వ భూముల్లో పేదలు ఆరు నెలలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి రాజకీయ పలుకుబడి కలిగిన వారి పేరుతో ఆన్‌లైన్ చేయించడం తగదన్నారు. 12 ఏళ్ల నుంచి అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలే జరగకపోవడంతో అసైన్డ్ భూములను ఇచ్చే అధికారం రెవెన్యూ అధికారులకు లేదన్నారు. ఎకరా కోటి రూపాయల విలువ చేస్తుండడంతో భూ కబ్జాదారులైన బిజినవేముల రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు కంచె వేసుకుని ఆక్రమించారన్నారు. వారి భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పేదలున్న ప్రాంతాలకు వచ్చిన రామచంద్రారెడ్డి, మరో 15మంది రౌడీ మూకలు ఆరు నెలలుగా ఉంటున్న మహిళలపై రాడ్లు, కర్రలతో దాడులు చేయడం తగదన్నారు. వారిని అరెస్టు చేయాలని కోరారు

అండర్-19 క్రికెట్ పోటీలు రసవత్తరం



ధనుష్ (135 పరుగులు)



ప్రసాద్ (121 పరుగులు)



ఎల్.లక్ష్మినారాయణ (110 పరుగులు)



హమీద్ (137 పరుగులు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 166 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన నెల్లూరు జట్టు రెండో రోజున శుక్రవారం 89.2 ఓవర్లలో 381 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని హమీద్ 137 పరుగులు చేయగా, మన్విత్‌రెడ్డి 52 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు బాలాజీ 4, చరణ్‌జీత్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 35 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాయణ 100 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఈయనకు జతగా చరణ్‌జీత్ 57 పరుగులు చేశాడు. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 190 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

ఆధిక్యంలో విశాఖ జట్టు..

కేఎస్‌ఆర్‌ఎం మధ్యలో నిర్వహించిన మ్యాచ్‌లో 82 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన విశాఖ జట్టు రెండో రోజున 92 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 432 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని కె.ఎ.ఎస్.ప్రసాద్ 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. యశ్వంత్ 90 పరుగులు, ఈశ్వర్ రిత్విక్ 55 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు ప్రదీప్ 2, జున్నారావు 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 58 పరుగులు చేసింది. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. రెండోరోజు ఆట ముగిసే సమయానికి విశాఖ జట్టు 162 పరుగుల ఆధిక్యంలో ఉంది.

కృష్ణా జట్టుకు స్వల్ప ఆధిక్యం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 16 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు రెండోరోజు శుక్రవారం 96 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్ 135 పరుగులు, శ్రీనిశ్చయ్ 87 పరుగులు చేశారు. పశ్చిమగోదావరి బౌలర్లు యశ్వంత్ 3 వికెట్లు తీశారు. కాగా పశ్చిమ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 281 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టు 34 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడ్డారు. రెడ్డీస్ కాలనీలో నివాసముంటున్న రామాంజులు రెడ్డి, ఉషారాణి(40) దంపతులు స్థానిక నీరుగట్టువారిపల్లిలో ఉషారాణి సిల్క్ హౌస్ పేరుతో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. పలువురి వద్ద రూ.15 లక్షల వరకు అప్పుచేశారు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమండంతో మానసిక ఒత్తిడికి గురయ్యారు. గురువారం తన ఇంటిలోనే ఉషారాణి చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబసభ్యులు వన్ టౌన్ పోలీసులకు తెలిపారు.

రాజా ఫౌండేషన్ నుంచి రూ.63 లక్షలు డ్రా చేశారు



ఉప తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం నాయకులు

ప్రొద్దుటూరు : రాజా ఫౌండేషన్ నుంచి రూ.63 లక్షలు డ్రా చేశారని, దీనిపై విచారణ జరిపించాలని ప్రజా పక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులు, ఎయిడ్స్, హెచ్‌ఐవీ బాధిత పిల్లల కోసం రాజారెడ్డి 2002లో రాజా ఫౌండేషన్ కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేశారన్నారు. ఈ సేవా కార్యక్రమాలను గుర్తించిన ప్రభుత్వం ట్రస్టుకు 70 ఎకరాల భూమి కేటాయించిందన్నారు. ఇందులో భాగంగా చౌడూరు వద్ద పూజా ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుచేశారని, తద్వారా వచ్చే ఆదాయంతో డాడీ హోంలో అనాథలను పోషించారని నిర్ణయించారన్నారు. తన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న ఎం.రాధ, బి.కవిత, బి.లక్ష్మీప్రసన్నలు తన ఆశయాలను నెరవేర్చుతారనే నమ్మకంతో రెండవ సప్లిమెంటర్ ట్రస్టు డీడ్ ద్వారా వారిని నియమించారన్నారు. గత ఏడాది ఆగస్టు 11న రాజా రెడ్డి హత్య గావింపబడడతో డాడీ హోం నిర్వహణ అయోమయంలో పడిందన్నారు. కలెక్టర్ ఆర్డీఓ ద్వారా నివేదిక తెప్పించుకుని కమిటీ ఏర్పాటుచేశారన్నారు. కొత్త కమిటీలో ఐదుగురు సభ్యులు కొత్తవారేనని, ట్రస్టుకు, సంస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గత ఏడు నెలల్లో రూ.63 లక్షలు డ్రా చేయడం జరిగిందని, అయినా డాడీ హోంలో వసతులు కల్పించలేదని తెలిపారు. ప్రభుత్వం విచారణ జరిపించాలని కోరారు. అనంతరం ఉప తహసీల్దారు సాయినాథరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



టెక్నికల్ డీఈకి వినతిపత్రం సమర్పిస్తున్న యుఈఏయూ నాయకులు

కడప కార్పొరేషన్ : విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు కామనూరు శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ భవన్‌లోని ఎస్‌ఈ కార్యాలయంలో టెక్నికల్ డీఈకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్తు సంస్థలో పని చేస్తున్న ప్రతి కాంట్రాక్టు కార్మికుడిని రెగ్యులర్ చేయాలని, 2022 సీఆర్‌సీ ప్రకారం అరియర్స్ ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఐటీఐ కార్మికులకు విద్యార్హత ఆధారంగా స్కిల్డ్ వర్కర్‌గా గుర్తించి రూ.27,950 వేతనం ఇవ్వాలన్నారు. 2020 నుంచి షిఫ్ట్ ఆపరేటర్లుగా చేరిన వారికి వేతనం పెంచాలన్నారు. ప్రతి సబ్ స్టేషన్‌లో వాచ్‌మెన్‌ను నియమించాలని, సంస్థలో పనిచేసే కార్మికుడికి ప్రమాదం జరిగినా, అనారోగ్యం పాలైనా వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలన్నారు. విశ్రాంత కార్మికులకు రూ.5 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరి, మణికంఠ, మహేశ్వరరెడ్డి, రామిరెడ్డి, గంగాధర్‌నాయక్, బాలక్రిష్ణ, హుస్సేన్, దుగ్గిరెడ్డి, బాబు, రమణారెడ్డి, శేఖర్, శివనాగేంద్ర రెడ్డి, చెన్నయ్య, మహేష్ పాల్గొన్నారు.

63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితులు, ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు

మైదుకూరు : మండలంలోని వనిపెంట రేంజ్‌లోని నల్లమల అటవీ ప్రాంతంలో అధికారులు దాడి చేసి శుక్రవారం 63 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఎర్ర చందనం చెట్లు నరుకుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రచందనం చెట్లు నరుకుతున్నట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో అటవీ రేంజ్ అధికారి ప్రణీత్‌రావు, తన సిబ్బందితో కలిసి కూంబింగ్ నిర్వహించారు. పలు చోట్ల చెట్లు నరుకుతూ ముగ్గురు పట్టుబడగా, మిగిలిన వారంతా పరారయ్యారు. దీంతో అక్కడ దొరికిన 63 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారికోసం గాలిస్తున్నట్టు రేంజ్ అధికారి ప్రణీత్‌రావు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. డీఆర్‌ఓ అన్వర్ హుస్సేన్, సిబ్బంది ఈశ్వరమ్మ, సురేంద్ర, గంగాధర్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఆటో-లారీ ఢీ... ఇద్దరు కూలీల మృతి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



లారీని ఢీకొని లోయలో పడిన ఆటో

14మందికి గాయాలు



మృతి చెందిన నాగమ్మ (ఫైల్)

పులివెందుల రూరల్ : వారంతా కూలీలు... రెక్కాడితే కానీ డొక్కడని కుటుంబాలు... జానెడు పొట్ట నింపుకోవడం కోసం కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్న వారిని లారీ మృత్యువు రూపంలో కబళించింది. ఈ ఘటన వైఎస్సార్ జిల్లా పులివెందుల-కదిరి ప్రధాన రహదారిపై జరిగింది. ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, 14మంది గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. సత్యసాయి జిల్లా, బత్రీపల్లి నుంచి కూలి పనులు చేసేందుకు 16మంది ఆటోలో పులివెందుల బయలుదేరారు. పులివెందుల-కదిరి ప్రధాన రహదారి డంపింగ్ యార్డ్ సమీపంలో వెనుక వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి నాగమ్మ(50) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, కదిరమ్మ, లక్ష్మీదేవి, రమణమ్మ, అనూష, ఈశ్వరమ్మ, రత్నమ్మ, శకుంతల, వెంకట లక్ష్మమ్మ, శైలు, రమాదేవి, నాగమ్మలతోపాటు మరో ముగ్గురికి గాయాలవగా, డ్రైవర్ ఆంజనేయులు స్వల్పంగా గాయపడ్డాడు. వారిని ప్రాథమిక చికిత్స కోసం పులివెందుల ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వారిలో చికిత్స పొందుతూ కదిరమ్మ (38) మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

కడప కార్పొరేషన్ : ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని జైభీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి.సంపత్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మాసాపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించినది కాదని, ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేస్తే.. మాదిగ సామాజికవర్గం ఓట్లను చీల్చవచ్చని భావిస్తోందన్నారు. ఎస్సీలలోని అన్ని ఉప కులాలు వివక్షకు, అంటరానితనానికి గురయ్యాయన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోనికి తీసుకోకుండా కేవలం రాజకీయ లబ్ధికోసం కమిటీలు వేసి మాల, మాదిగల వర్గీకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పజెప్పడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

అక్రమ మద్యం అమ్మితే చర్యలు



మద్యం సీసాలు పట్టుకున్న సెబ్ అధికారులు

జమ్మలమడుగు : రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చి అమ్మితే కఠిన చర్యలు తప్పవని సెబ్ సూపరింటెంటెంట్ శ్రీనివాసులునాయుడు అన్నారు. స్థానిక పెద్దపసుపల రహదారిలో గణేష్ రైతుమిత్ర రూరల్ వేర్‌హౌస్ వద్ద ప్రత్యేక వాహనంలో మద్యం తరలిస్తున్నారంటూ సమాచారం రావడంతో సీఐ శ్రీలత, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించారు. హరియానా, తెలంగాణ రాష్ట్రాల నుంచి అక్రమం మద్యం తెచ్చి విక్రయిస్తుండడంతో వినయ్‌కుమార్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, ఖాజాలను పట్టుకుని విచారించినట్లు తెలిపారు. వారి నుంచి 144 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో పాల్గొన్న సైదులు, జాకీర్ హుస్సేన్‌లను ఆయన అభినందించారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని రూపరాంపేట శివాలయం సమీపంలోని కుంటలో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. శివానగర్‌కు చెందిన రామలక్ష్మమ్మ తన కుమారుడితో కలిసి జీవిస్తోంది. ఈమె భర్త రోశయ్య మరణించాడు. అయితే కొడుకు, కోడలు నిత్యం గొడవ పడుతూ ఉండటంతో మనస్తాపానికి గురైన ఆమె కుంటలో దూకేందుకు యత్నించారు. స్థానికులు గమనించి పోలీసులకు తెలుపడంతో కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి వృద్ధురాలిని వారికి అప్పగించారు.

18న అరుణాచలానికి ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఈ నెల 18వ తేదీన జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి ఉదయం 6 గంటలకు రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి సూపర్ లగ్జరీ సర్వీసు నడుపుతున్నామన్నారు. పెద్దలకు రూ.1277 ఛార్జి ఉంటుందన్నారు.

- బద్వేలు డిపో నుంచి ఉదయం 7 గంటలకు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా రెండు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ బస్సుల్లో రూ.1668 ఛార్జీ ఉంటుందన్నారు. మరో రెండు బస్సులు ఉదయం 7 గంటలకు కడప, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళ్తాయని, వాటిలో ఛార్జీ రూ.1494గా ఉందన్నారు.
- మైదుకూరు డిపో నుంచి ఉదయం 6 గంటలకు ప్రత్యేక బస్సు పోరుమామిళ్లలో బయలుదేరి కడప, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళ్తుందని, ఇందులో ఛార్జి రూ. 1414గా ఉందన్నారు. మరో బస్సు సాయంత్రం 5.00 గంటలకు కడప, చిత్తూరు మీదుగా వెళ్తుందని ఇందులో రూ. 1209గా ఛార్జి నిర్ణయించామన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి సాయంత్రం 6 గంటలకు బయలుదేరి మైదుకూరు, కడప మీదుగా అరుణాచలానికి వెళ్తుందని, ఇందులో రూ.1273గా ఛార్జి ఉందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరి రాయచోటి, పీలేరు మీదుగా అరుణాచలానికి వెళ్తుందన్నారు. ఇందులో రూ. 1242 ఛార్జి ఉందన్నారు.
- జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళ్తోందని, ఇందులో రూ. 1568 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. మరో బస్సు సాయంత్రం 5.30 గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణాచలానికి వెళ్తోందన్నారు. ఇందులో ఛార్జి రూ. 1352గా ఉందన్నారు.

హీటర్‌ను తాకి బాలుడు మృతి

పుల్లంపేట : అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడి అల్లరి చూసి తల్లిదండ్రులు మురిసిపోయారు. వారి సంతోషం ఎంతో కాలం నిలవలేదు. ఆడుతూ పాడుతూ బక్కెట్‌లో పెట్టిన వాటర్ హీటర్‌ను తాకిన చిన్నారి ఒక్కసారిగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, బాలుడి తల్లిదండ్రుల వివరాల మేరకు.. మండలంలోని దళవాయిపల్లి గ్రామానికి చెందిన రాజబోయిన సెల్వం, బిందుప్రియల కుమారుడు జాన్ వెస్లిన్(3)ను అల్లారు ముద్దుగా పెంచుకున్నారు. శుక్రవారం తల్లి వేడి నీటి కోసం.. బక్కెట్‌లో నీరుపోసి బాత్‌రూమ్‌లో వాటర్ హీటర్ పెట్టారు. అనంతరం బిందు ప్రియ ఇంట్లో పనిచేసుకుంటుండగా.. ఆడుతూ అటువైపుగా వెళ్లిన జాన్‌వెస్లిన్ దానిని తాకాడు. వెంటనే షాక్ తలగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొద్ది సేపటికి బాలుడిని వెతుక్కుంటూ వచ్చిన తల్లికి కుమారుడు విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.